
ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



సకాలంలో రీ సర్వే పూర్తి చేయండి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఏలూరు, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ అంశాలపై ఆమె సమీక్షించారు. సీసీఎల్ ఆదేశాల మేరకు నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. జూన్ 1 నుంచి రేషన్ పంపిణీకి అన్ని చర్యలు తీసుకోవాలని, విభిన్న ప్రతిభావంతులు, 65 ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ అందించాలన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం నిర్మూలించాలి

జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. 'నాషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడారు. జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ నివారణ దినోత్సవం సందర్భంగా జూన్ 1 నుంచి 26 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. నగరంలో ఇండోర్ స్టేడియం వద్ద అన్న క్యాంటిన్‌ను బుధవారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రుచి, నాణ్యత పరిశీలించారు.

యోగాసనాలపై అవగాహన

యోగాంధ్ర కార్యక్రమంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గురువారం ద్వారకాతిరుమలలో యోగాసనాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జూన్ 5న పోలవరం, 11న గురవాయిగూడెం, 10న గుంటుపల్లి బౌద్ధరామాలు వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

గర్భిణులు, బాలింతలకు 'కిల్కారి' సేవలు

ఏలూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : మాతాశిశు మరణాలను నియంత్రణలో భాగంగా 'కిల్కారి' పేరిట సేవలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లా వైద్యాధి కారి కార్యాలయంలో ఆశా నోడల్ ఆఫీసర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తెలిపారు. గర్భిణి 4వ నెల నుంచి బిడ్డకు ఏడాది వయసు వరకు ఆరోగ్య క్షేమ సమాచారం 'కిల్కారి' నెంబరు 012 44451660 నుంచి వారి మొబైల్‌కు వస్తుందన్నారు. వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరు 14423కు కాల్ చేయవచ్చన్నారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, వేదికపై ప్రసంగిస్తున్న నిమ్మల రామానాయుడు, ఏర్పాట్లలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఉమ్మడి జిల్లా నాయకులు పాతూరి రామరాజు, వలవల బాబ్జి, తదితరులు

మహానాడు అదుర్స్

మహానాడులో గురువారం జరిగే బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలు సొంత వాహనాల్లో బయల్దేరారు. గడిచిన రెండు రోజులుగా ప్రతినిధుల సభలో సుమారు మూడున్నర వేలమందికి పైగా ఉమ్మడి పశ్చిమ నుంచి టీడీపీ తీర్మానాల చర్చల్లో పాలు పంచుకున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తమకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు.

తెలుగుదేశం వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అప్పగించిన బాధ్యతల్లో మన మంత్రులు, ఎమ్మెల్యేల సక్సెస్

- చెమటోడ్చిన మంత్రులు, మాజీలు
- ప్రతినిధుల సభలో కార్యకర్తల జోష్
- నేడు బహిరంగ సభ.. తరలిన తమ్ముళ్లు

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

తెలుగుదేశం కార్యకర్తలు, నేతలంతా మహానాడులో కదం తొక్కారు. ఎమ్మెల్యేల సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్, మిగతా సీనియర్లను కలిసేందుకు ప్రయత్నాలు చేశారు. మహానాడు విశేషాలను ఎప్పటికప్పుడు తమ నియోజకవర్గ ప్రజలకు చేరవేసేందుకు ప్రయత్నించారు. మంత్రి రామానాయుడు సభా వేదిక పర్యవేక్షణలో క్షణం తీరిక లేకుండా వ్యవహరించి సీఎం చంద్రబాబు ప్రశంసలు పొందినట్లు సమాచారం. ఆహార కమిటీలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చురుగ్గా వ్యవహరించారు. ఎప్పటికప్పుడు అవసరాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయగలిగారు. పార్టీ కోశాధికారి మెంటే పార్థసారథి పార్టీ ఆదాయం, ఖర్చులు వివరించడమే కాకుండా పార్టీ ఆర్థిక వ్యవహారాల చర్చల్లో పాల్గొన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పార్కింగ్ కమిటీలో చెమటోడ్చి పనిచేశారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఒకవైపు కడపలో మహానాడు అట్టహాసంగా సాగుతుండగా, నియోజకవర్గాల్లో కార్యకర్తలే దగ్గరుండి బుధవారం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అందుబాటులో లేకపోయినా కార్యకర్తలే చురుగ్గా వ్యవహరించారు. ఏలూరు నగరంతో పాటు మిగతా నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాదాపు అన్ని నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో ఎన్టీఆర్‌కు నివాళులర్పించేందుకు కార్యకర్తలు ముందుకొచ్చారు.



కలెక్టరేట్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, అధికారులు



ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏఎస్పీ శేఖర్, సిబ్బంది

అధికారికంగా ఎన్టీఆర్ జయంతి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ శేఖర్, అధికారులు నివాళులర్పించారు.



ఎంపీగా పాకా సత్యనారాయణ

ప్రమాణ స్వీకారం

రాజ్యసభ సభ్యుడిగా పాకా వెంకట సత్యనారాయణ న్యూఢిల్లీలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిమ్మ @ 10

భారీగా పతనమైన నిమ్మ ధర

పెట్టుబడులు రావంటూ రైతుల ఆవేదన

వర్షాలతో నిండా మునిగిన రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి

లోపలి పేజీలో



'వాల్యుయేషన్' లోపాలు నిజమే

- ఆంధ్రజ్యోతి కథనంపై ఏలూరు డీఈవో వివరణ

ఏలూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): మూల్యాంకనం సిబ్బంది తప్పిదం/నిర్లక్ష్యం కారణంగా పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోయారు. 'పిల్లల జీవితాలతో ఆటలా' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం నిజమేనని డీఈవో వెంకటలక్ష్మమ్మ అంగీకరించారు. పత్రికా కథనంలో అంశాలను సరిచూశామని, అవన్నీ నిజమేనని ధ్రువీకరిస్తున్నట్లు బుధవారం చెప్పారు. విద్యార్థుల ఏడు సబ్జెక్టుల జవాబు పత్రాలను రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో మూల్యాంకనం చేశారని వివరించారు. ఇలాంటి తప్పులు జరగకుండా అమరావతిలోని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం తగిన జాగ్రత్తలు/చర్యలు తీసుకోవాలి. ఈ తప్పిదాలు ఏలూరు జిల్లాలో జరిగిన మూల్యాంకనంలో జరిగినవి కావని స్పష్టం చేశారు.

ఖరీఫ్ ప్రణాళిక రెడీ

- 11,117 ఎకరాల్లో వరి నారుమడులు
- 10,721 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

జిల్లాలో 2,22,347 ఎకరాల్లో వరి సాగు



ఏలూరు సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. 2,22,347 ఎకరాల్లో వరి సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. 11,117 ఎకరాల్లో వరి నారుమళ్లు వేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు భూమి దుక్కి దున్ని ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల బోర్ల కింద, వర్షాధార ప్రాంతాల్లో నారుమడులు వేశారు. ఖరీఫ్‌లో స్వర్ణ, ఎంటీయూ 1318, 1061, 7029, 5204, 1061, 1126, 1121 రకాలను ఎక్కువగా సాగు చేస్తారు. 10,721 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అంచనా కాగా ప్రస్తుతం 5,100 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ప్రణాళికలో పేర్కొన్నారు. సబ్సిడీపై వరి విత్తనాలు, పచ్చి రొట్ట, ఎరువులు ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

సిద్ధంగా ఎరువులు

ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధంగా ఉంచామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 1,18,402 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేయగా 49,435 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంచారు. మార్క్‌ఫెడ్ గొడౌన్‌లో 7,221 మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్ ఉంది. సహకార సంఘాల వద్ద 7,507 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 27 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు, హోల్ సేల్ డీలర్ల వద్ద 34,680 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వలు ఉన్నట్టు ప్రణాళికలో పేర్కొన్నారు.

దిగుబడి లక్ష్యం 7.15 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి 7.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని అంచనా. ప్రకృతి సహకరిస్తే దిగుబడి పెరిగే అవకాశాలున్నా యని చెబుతున్నారు. నారుమడులు జూన్ మొదటి, రెండు వారాల్లో ప్రారంభమవుతాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్కే హబీబ్ బాషా తెలిపారు.

దూర విద్య ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు

ఏలూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌లో భాగంగా బుధవారం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు జిల్లా లో 19 మంది విద్యార్థులు, కెమిస్ట్రీ 24మంది హాజరయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జరిగిన ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజి పేపర్-2 (సంస్కృతం) పరీక్షకు నలుగురు విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలకు బుధవారం 47 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో 95 మంది విద్యార్థుల కు 48మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఎక్కడా అవాంఛ నీయ సంఘటనలు నమోదు కాలేదన్నారు.

కొవిడ్ నిర్ధారణ !

ఏలూరు జిల్లాలో మరో పాజిటివ్ కేసు



పైడిపర్రులో స్ప్రే చేస్తున్న సిబ్బంది

ఏలూరు అర్బన్/తణుకు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన మహిళకు కొవిడ్ నిర్ధారణ అయ్యింది. జిల్లాలో మరొకరికి కొవిడ్-19 పాజిటివ్ నిర్ధారణైంది. ముసునూరు మండలం ఎల్లాపురానికి చెందిన 52 ఏళ్ల వ్యక్తి కొవిడ్ లక్షణాలతో బుధవారం ప్రభుత్వాసుపత్రికి రాగా, వైద్య నిపుణుల సూచనల మేరకు టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ఈ వ్యక్తి ఆరోగ్యం నిలకడగానే ఉందని, స్థానికంగా హోం ఐసోలేషన్‌లో ఉన్నట్టు వైద్య వర్గాలు తెలిపాయి. కొవిడ్ పాజిటివ్‌తో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరు శాంతినగర్‌కు చెందిన దంపతులిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐడీఎస్‌పీ విభాగం వైద్యాధికారులు వెల్లడించారు. అలాగే తణుకు మండలం పైడిపర్రుకు చెందిన మహిళకు రాపిడ్ టెస్ట్‌లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. రాజమండ్రిలో చికిత్స పొందుతున్న ఆమెను బుధవారం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు ఆ మహిళ నివాసం వద్ద మునిసిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. కేసు వివరాలను మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై తణుకు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎన్.డేనియల్‌రాజు మాట్లాడుతూ 'పైడిపర్రు మహిళకు కరోనా అనుమానంతో రాజమండ్రిలో పరీక్షలు జరిపారు. రాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చింది. ఆర్టీపీసీఆర్ టెస్ట్ రిపోర్టును బట్టి కరోనా నిర్ధారణ జరుగుతుంది. పూర్తి వివరాలను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు పంపించాం' అని తెలిపారు.



కన్నీటి గోదారి

గోదావరిలో గల్లంతైన ముగ్గురు బాలుర మృతదేహాలు లభ్యం

కుటుంబాల్లో అంతులేని విషాదం

ఉసురు తీసిన అప్పు..

ప్రైవేట్ ఫైనాన్షియర్ ఒత్తిడి

ఒకరి ఆత్మహత్య

కె.కన్నాపురంలో విషాదం

లోపలి పేజీలో

పసుపు జాతర


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

ద్వారకాతిరుమలలో పెళ్లి సందడి




ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరుగుతున్న వివాహ శుభ కార్య వేడుక... శ్రీవారి క్షేత్రంలో భక్తుల క్యూ

ద్వారకాతిరుమల, మే 28(ఆంధ్రజ్యోతి): వివాహాలు చేసుకునేందుకు మంచి ముహూర్తం కావడంతో బుధవారం శ్రీవారి క్షేత్రం ఇందుకు వేదికైంది. ఈ జ్యేష్ట మాసంలో ఉన్న అతి తక్కువ ముహూర్తాల్లో ఇది తొలిముహూర్తం కావడంతో వివాహాది శుభకార్యాలు అనివేటి మండప ప్రాంతంలోను, ప్రైవేటు కల్యాణమండపాల్లో శాస్త్రోక్తంగా జరిగాయి. అగ్నిక్రియలను జరిపించి శుభముహూర్త సమయంలో నూతన వధూవరులు మూడుముళ్లబంధంతో ఒక్కటైనారు. స్థానిక పాతకల్యాణమండప ప్రాంతంలోనూ ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌లోను వివాహాలు అధికంగా జరిగాయి. వివాహానికి కొన్ని వర్గాల్లో వరునికి ముందుగా జరిగే కాశీయాత్ర ప్రక్రియ చూపరులను అలరించింది. కాళ్లకు పావుకోళ్ళు, చేతిలో గొడుగు, కమండలం, దండంను ధరించిన వరుడు కాశీయాత్రను బయలుదేరే ఘట్టం ఆకర్షణగా నిలిచింది. పెళ్లిళ్ల అనంతరం వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

నెలపొడుపు నాడు క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి బుధవారం భక్తుల తాకిడి పెరిగింది. అమావాస్యనాడు మంగళవారం తగ్గిన భక్తుల రద్దీ జ్యేష్టమాసం నెలపొడుపు కావడంతో పాటు ఆలయ ప్రాంగణంలో వివాహాది శుభకార్యాలు జరడగడంతో విపరీతంగా పెరిగింది. దాదాపు పది వేల మంది పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆధునీకరించి మూసి వేశారు!

ఇది పెన్నాడ రైల్వే స్టేషన్ దుస్థితి.. ప్రయాణికుల అసహనం


పెన్నాడ రైల్వే స్టేషన్

పాలకోడేరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన పెన్నాడ రైల్వే స్టేషన్ మూతపడింది. స్టేషన్‌ను పునరుద్ధరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని వినతులు అందించినా ఫలితం ఉండటం లేదు.

భీమవరం నుంచి నరసాపురం వెళ్ళే రైల్వే మార్గంలో పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారంలో సుమారు 18 కోట్ల రూపాయల వ్యయంతో రైల్వే స్టేషన్‌ను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధిపరిచారు. దీనిలో భాగంగా అతిపెద్ద ప్లాట్‌ఫామ్, రెండు ప్లాట్‌ఫారాలను కలుపుతూ వంతెన నిర్మాణం, లిఫ్ట్ సౌకర్యం, టిక్కెట్ కౌంటర్, రిజర్వేషన్ టిక్కెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. కరోనా పేరు చెప్పి పెన్నాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కడం లేదంటూ రైల్వే అధికారులు ఆ స్టేషన్‌ను మే నెల 2023 నుంచి మూసివేశారు. ఈ గ్రామాన్ని ఆనుకుని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (బైట్) కళాశాల, ఎఫ్‌సీఐ గొడౌన్‌తోపాటు సుమారు 40 వేలు జనాభా నివసించే ప్రాంతాలు ఈ స్టేషన్‌ను ఆనుకుని ఉన్నాయి. ఎంతో ఉపయోగకరమైన ఈ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి నాలుగు లైన్లు ఏర్పాటు చేసి ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అటువంటి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసిన కొంత కాలానికే మూసివేయడంతో అటుగా ప్రయాణం చేసే ప్రయాణికులు ఇదెక్కడి విడ్డూరమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రైల్వే స్టేషన్‌లో ఒక స్టేషన్ సూపరింటెండెంట్, నలుగురు స్టేషన్ మాస్టర్లు, 9 మంది పాయింట్‌మెన్స్‌లు నేటికీ పని చేస్తూనే ఉన్నారు. రైలు వెళ్ళినప్పుడు, వచ్చినప్పుడు సిగ్నల్స్ కంట్రోల్ చేయడం, తదితర కార్యకలాపాలను ఆ సిబ్బంది ప్రతిరోజు నిర్వహిస్తూనే ఉంటారు. ఈ గ్రామంలో గతంలో ఏడు పాసింజర్ రైళ్లు అటూ ఇటూ తిరుగుతూ ప్రయాణికులకు ఎంతో సురక్షితమైన ప్రయాణాలను అందించేవి. విద్యార్థులు ఈ రైలులోనే వచ్చి కళాశాలకు వెళుతుండేవారు.

వినతి పత్రాలు అందించిన గ్రామస్థులు

రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలంటూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతోపాటు ప్రజాప్రతినిధులకు, అధికారులకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు పలుమార్లు వినతిపత్రాలను అందించారు. ఈ రైల్వే స్టేషన్‌లో రైళ్ళు ఆగే వరకు తమ పోరాటం సాగిస్తామని వారు చెబుతున్నారు.

అన్ని సౌకర్యాలు ఉన్నాయి


కునుకు రామకృష్ణ

పెన్నాడ అగ్రహారంలోని రైల్వే స్టేషన్‌కు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. సిబ్బంది ఉన్నారు. వారికి జీతాలు కొత్తగా ఇవ్వవలసిన అవసరం లేదు. ఎప్పటిలాగానే మా గ్రామంలో పాసింజర్ రైళ్లను ఆపే విధంగా ప్రభుత్వాలు చూడాలి.

కరోనా సాకుతో మూసివేశారు


రమేష్, పెన్నాడ

కరోనా సమయంలో అన్ని రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికులు అంతంత మాత్రంగానే ఎక్కేవారు. కానీ పెన్నాడ రైల్వే స్టేషన్‌ను కరోనా సాకుతో ప్రయాణికులు ఎవరూ ఎక్కడం లేదనే సాకు చూపించి రైల్వే స్టేషన్‌ను రైల్వే అధికారులు మూసివేశారు. రైల్వే స్టేషన్‌ను మళ్ళీ పునరుద్ధరించాలి.

మరపురానిది 'మహానాడు'

1988లో మహానాడు ఏర్పాట్లు చేశా : మాజీ ఎంపీ చేగొండి వెంకటహరరామ జోగయ్య


దివంగత ఎన్టీఆర్‌తో జోగయ్య (ఫైల్)

పాలకొల్లు, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచమంతా చాటిన మహనీయుడు నందమూరి తారకరామరావు అని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామ జోగయ్య కొనియాడారు. ఇప్పుడు కడపలో జరుగుతున్న మహానాడు పండుగ సందర్భంగా ఆయన 1988లో విజయవాడలో జరిగిన మహానాడు వేడుకను ఈ సందర్భంగా గుర్తు చేసుకుని ఆంధ్రజ్యోతితో బుధవారం మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని ఆయన నివాసంలో 88నాటి మహానాడు ముచ్చట్లను వివరించారు. 88లో విజయవాడలో మహానాడు నిర్వహించేందుకు పరిశీలనకు వచ్చిన ఎన్టీఆర్ ముఖ్య నాయకులతో భేటీ అయిన సందర్భంలో చంద్రబాబునాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఇంకా పలువురు తక్కువ వ్యవధిలో ఇక్కడ ఏర్పాట్లు పూర్తి చేయలేమనీ, చేసినా మూడు రోజులు నిర్వహణ సాధ్యం కాదని అప్పటి సీఎం ఎన్టీర్‌కి చెప్పారని మౌనంగా ఆలకించిన ఎన్టీఆర్ తర్వాత తనను పిలిచి ఇక్కడ ఏర్పాట్లు బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను. సమర్థవంతంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అప్పటికప్పుడు రూ.5 లక్షల నగదు అందజేసి ఆదేశించారని తెలిపారు. తాను వెంటనే తన మకాం తాత్కాలికంగా విజయవాడకు మార్చి ఏర్పాట్లలో నిమగ్నమయ్యానన్నారు. కేవలం 12 రోజులు వ్యవధిలో భారీ బహిరంగ సభా ప్రాంగణంలో అదనంగా వచ్చిన ప్రజలు తిలకించడానికి తాత్కాలికంగా ఏడు థియేటర్లను, అందులో స్క్రీన్‌లు ఏర్పాటు చేశామని ఆనాటి మూడు రోజులు పండుగ తాను మరువలేనన్నారు. మహానాడు జరిగిన రోజుల్లో ఎన్టీఆర్ తన ఇంట్లోనే భోజనం చేశారని నాలుగురోజులు పాటు తన భార్యనే స్వయంగా ఆహార పదార్థాలు వండి వడ్డించారన్నారు. ఆనాడు మహానాడు నిర్వహణ కార్యక్రమం తనకు అప్పగించడం ఎప్పటికీ మరువలేనని, ఆనందం వ్యక్తం చేశారు.

పోషకాల గని.. ఈతపండ్లు



ఈత పండ్లు

గణపవరం, మే 28(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణంలో స్వచ్ఛమైన గాలితో పాటు ప్రకృతి ప్రసాదించే పండ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. వేసవిలో లభించే పండ్లలో ఈతపండ్లను ఎటువంటి రసాయనాలు లేకుండా, కృత్రిమంగా మగ్గబెట్టకుండా విక్రయిస్తుంటారు. పోషకాల గనిగా పిలువబడే ఈ పండ్లను పేదవాని పండ్లుగా పిలుస్తుంటారు. వేసవి సీజన్‌లో జీవనోపాధిగా ఈతపండ్ల విక్రయాలను మహిళలు, యువకులు మలుచుకుంటున్నారు. వేసవి సెలవుల్లో పట్టణాలు, నగరాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన పిల్లలు ఈతపండ్లను ఇష్టంగా తింటుంటారు.

గ్రామాల్లో ఈతచెట్లు అధికం..

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఈతచెట్లే దర్శనమిస్తాయి. నగర, పట్టణవాసులకు తెలియకపోయిన పచ్చని పొలాల వెంబడి వెళ్లి పిల్లలు ఈతచెట్లు ఎక్కి కాయలు కోసుకుని తింటుంటారు. గుత్తులుగుత్తులుగా కాసే కాయలతో బాటసారులను కనువిందు చేస్తుంటాయి. పంట పొలాల్లోనూ పుంతల్లోనూ, కాల్వగట్లపైన ఉండే ఈతచెట్లు నిండైన రూపంతో కనువిందు చేస్తాయి. ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాల్లోని పలు మండలాల నుంచి ఈతపండ్లు తీసుకొచ్చి ప్రధాన నగరాలతో పాటు గణపవరంలో విక్రయిస్తున్నారు. ఎండు ఖర్జూరం తరహాలోనే మంచి పోషకాలు, రుచితో ఉంటాయని ఆయుర్వేదనిపుణులు సూచిస్తున్నారు. ఈతచెట్టుపై పచ్చగా ఉన్న కాయలు పసుపు రంగులో మారిన వెంటనే వాటిని సంచులు, కుండల్లో ఎండుగడ్డితో మగ్గబెట్టి పండ్లుగా తయారు చేస్తారు. అవి మార్కెట్‌లో గ్లాసు సైజులను బట్టి రూ.10 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుంటారు.

ఈత పండ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి



ఈత పండ్లు ఆరోగ్యానికి దివ్యఔషదం. ఈ పండ్లలో ఎన్నో పోషకగుణాలతో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రక్తప్రసరణ మెరుగు చేస్తాయి. ఐరన్, గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లు ఉంటాయి. కాల్షియం కూడా అధికంగా ఉండడంతో ఎముల పటుత్వానికి ఉపయోగం. సీ, బీ విటమిన్‌లు ఉంటాయి. ఫోలిక్ యాసిడ్ ఔషద గుణాలు.. మహిళలు, గర్భిణులకు రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయి. గుండెపోటు, పక్షవాతం నివారిస్తుంది. ఆకలి పెరుగుతుంది. అలసట, నీరసం, మానసిక రుగ్మతల నుంచి రక్షిస్తుంది.

- కె.ప్రియాంక, ప్రభుత్వ వైద్యాధికారి, పిప్పర.

రేషన్ కార్డులకు గడువు మూడు రోజులే

పశ్చిమ జిల్లాలో ఇప్పటివరకు 22,496 దరఖాస్తుల స్వీకరణ

భీమవరంటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి గడువు మూడు రోజులే ఉంది. ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 11 నెలల తరువాత కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 22,496 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి, వీటిలో కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకునేవారు 2,785 మంది జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్నారు. అడ్రస్సుల మార్పుల కోసం 1,037, ఆధార్ యాడింగ్ కోసం 244, చేర్పుల కోసం 15,622, డిలీషన్స్ కోసం 709 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల పరిశీలన

గ్రామ సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులు సంబంధిత వీఆర్‌వో లాగిన్‌కు రావడంతో వాటిలో అర్హతలను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పేర్లు తొలగింపు, అడ్రస్సుల మార్పులు, తదితర దరఖాస్తులను పరిశీలన చేసి తహసీల్దార్లకు పంపిస్తున్నారు. ఇంకా మూడు రోజులు గడువు ఉండడంతో ఇంకా ఎన్ని దరఖాస్తులు వస్తాయో అనే దానిపై అంచనా వేసుకుంటున్నారు.

జూన్‌లో కొత్త కార్డులు

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నవారిలో అర్హత సాధించిన వారికి వచ్చేనెలలో కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. కార్డులు మంజూరైన వారికి జూలై నుంచి రేషన్ అందించనున్నట్లు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రావలసి ఉంది.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన జడ్పీ సీఈవో భీమేశ్వర్, సిబ్బంది

'జడ్పీ'లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ఏలూరుసిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయం ఏలూరులో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమాన్ని జడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని జడ్పీ సీఈవో భీమేశ్వర్ పేర్కొన్నారు. పౌరాణిక పాత్రల ధారణలో ఎన్టీఆర్‌కు ఎవ్వరూ సాటిలేరని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు.



ఏపీ నిట్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతోనే మెరుగైన ఆరోగ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): యోగాతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏపీ నిట్‌లో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ప్రతీ ఒక్కరి జీవన శైలిలో భాగం కావాలన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులు క్రమం తప్పకుండా నిత్యం యోగా సాధన చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడంతో పాటు శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ తాలారి రేష్మ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజేష్, డాక్టర్ మూర్తి, సాస్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక కేటగిరీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీలలో ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు పొందే విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బుధవారం నూజివీడులో నిర్వహించారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరిల్లో ప్రవేశాలకు సంబంధించి మొత్తం 473 మందికి కాల్ లెటర్లు పరంగా 346 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటాలో 320 మందికి కాల్ లెటర్లు పంపగా 227 మంది, క్యాప్ కోటాలో 153 మందికి కాల్ లెటర్లు పంపగా 119 మంది అభ్యర్థులు హాజరైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జున్‌రావు, ప్రొఫెసర్ గోపాలరాజు, ఏవో బండి ప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

యానాం మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

» రూ.25 వేల విలువైన మద్యం, రూ.లక్ష విలువైన కారు స్వాధీనం

పెనుగొండ, మే 28(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద మంగళవారం రాత్రి అక్రమంగా యానా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 98 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దొంగరావిపాలెంలో వాహనాలు తనిఖీలు చేయగా పట్టుబడినట్టు తెలిపారు. పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుంచి ఇరగవరం మండలం కంతేరుకు చెందిన కొవ్వూరి వెంకట శ్రీనివాసరెడ్డి తాడేపల్లిగూడెంకు చెందిన గుత్తుల శ్రీనివాసరావుకు సరఫరా చేయడానికి తీసుకెళుతుండగా పట్టుకున్నారు. యానంలోని లక్ష్మి వైన్స్ నుంచి కాపగంటి సుమన్ మద్యాన్ని శ్రీనివాసరెడ్డికి విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. శ్రీనివాసరెడ్డిని, గుత్తుల శ్రీనివాసరావులను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.25వేలు విలువ చేసే 66లీటర్ల మద్యం, రూ.లక్ష విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి, హెచ్‌సీ శ్రీనివాసరావు, వై.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

» ఏడు బైక్‌లు స్వాధీనం

కృత్తివెన్ను, మే 28: చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసై బైక్‌లను దొంగలిస్తున్న ఓ యువకుడితో పాటు మరో మైనర్‌ను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలను సీఐ నాగేంద్రప్రసాద్ కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని పల్లెపాలెం వద్ద ఎస్‌ఐ పైడిబాబు తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, భీమవరం వైపు నుంచి నంబర్ ప్లేట్లు లేని రెండు బైక్‌లపై వస్తున్న ఇద్దరు.. అనుమానాస్పద రీతిలో కనిపించారు. వారిని విచారించగా ఓ వ్యక్తి భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన విల్లూరి సుధీర్‌బాబుగా గుర్తించారు. మరో మైనర్ బాలుడితో కలిసి చెడు వ్యసనాలకు బానిసై కొంత కాలంగా బైక్‌లను దొంగలిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. దొంగలించిన బైక్‌లను మండల పరిధిలోని పడతడిక వద్ద ముళ్లపొదల్లో దాచి ఉంచారని, వాటిని విక్రయించే క్రమంలో తమకు చిక్కారని తెలిపారు. వారి నుంచి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ పరిధిలోవి కాగా, రెండు బంటుమిల్లి స్టేషన్, మరొకటి భీమవరం రూరల్ స్టేషన్ పరిధిలో బైక్‌లుగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు.

నిమ్మ @ 10

» భారీగా పతనమైన నిమ్మ ధర » పెట్టుబడులు దక్కవని రైతుల ఆవేదన



మార్కెట్ యార్డులో వున్న నిమ్మకాయల రాశి

పెదవేగి, మే 28 (ఆంధ్రజ్యోతి): నిమ్మ ధర పతనమైంది. ఏడాదిన్నర కాలంగా రైతుల ఆశలకు అనుగుణంగా ఉన్న ధర పది రోజులుగా తగ్గుతూ ఇప్పుడు మరింత తగ్గింది. 2024 మార్చి నుంచి నిమ్మ ధర పెరుగుతూ అదే ఏడాది కిలో ధర సెంచరీ మార్క్‌ను దాటింది. అప్పటినుంచి కాస్త నిలకడగా కొనసాగుతూ ఈనెల వరకు కొంచెం అటూ ఇటుగా కిలో రూ.50 నుంచి రూ.70 పలికింది. అంతకుముందు ఏడాది వరకు గిట్టుబాటు ధరలేక అల్లాడిన రైతులు ఏడాదిన్నరగా కొంతమేర లాభపడ్డారు. ఈనెల ప్రారంభం నుంచి ధర పతనమవుతూ రావడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం నిమ్మలకాయల మార్కెట్‌లో సోమవారం కిలో నిమ్మ రూ.15 నుంచి రూ.25ల మధ్య పలుకగా మంగళవారం మరింత దిగజారి కిలో రూ.10 నుంచి రూ.15కు పడిపోయింది. సాధారణంగా ఈనెలాఖరు వరకు నిమ్మకు మెరుగైన ధర ఉంటుంది. కానీ ఈ ఏడాది మేనెల ప్రారంభం నుంచి తగ్గుతూ ఇప్పుడు రూ.15లకు పడిపోవడంతో రైతులు దిగాలు చెందు తున్నారు. ధర తగ్గుదల కు వర్షాలు కురవడమేనని వ్యాపారులు చెబుతున్నారు.

శ్రమ కూడా దక్కేలా లేదు



ఒక్కసారిగా తగ్గిన ధర మా ఆశలను అడియాసలు చేసింది. పెట్టుబడి పక్కన పెడితే కీసం శ్రమకు తగిన ఫలితం కూడా దక్కదు. ఎరువులు, పురుగుల మందులు, కూలీలు.. ఇలా పెట్టుబడి చూస్తే చాంతాడంత ఉండగా రాబడి లేదు. ఈ ఏడాది అప్పులే మిగులుతాయి.

– మాదు రాట్నాలరావు
నిమ్మరైతు, లక్ష్మీపురం

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి



సాగు పెట్టుబడి భారీగా పెరగ్గా ధర తగ్గింది. కిలో కనీసం రూ.50 తగ్గకుండా ఉంటే లాభదాయకం. ప్రభుత్వం ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మేలు జరుగుతుంది. ఉపాధి పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే మరింత వెసులుబాటుగా ఉంటుంది.

– మారగాని అమల వరప్రసాద్
నిమ్మ రైతు, లక్ష్మీపురం



పాలకొల్లులో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్.. పెనుగొండలో తహసీల్దార్ అనితకుమారి.. ఆకివీడులో తహసీల్దార్ వెంకటేశ్వరరావు థియేటర్లను తనిఖీ చేస్తున్న దృశ్యాలు

సినిమా థియేటర్లలో తనిఖీలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని థియేటర్లలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల పరిశీలన

పాలకొల్లుఅర్బన్/పెనుగొండ/ గణపవరం/నరసాపురం/ మొగల్తూరు/తణుకు/అత్తిలి/ఆకివీడు/తాడేపల్లిగూడెం రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు పట్టణాల్లో వున్న సినిమా థియేటర్లను ఆయా మండలాల తహసీ ల్దార్లు, రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. థియేటర్ల లైసెన్స్‌లు, ఫైర్, ఆర్‌అండ్‌బీ, ఇతర డిపార్టుమెంట్లు ఇచ్చిన అనుమతులు, ఫిల్మ్ డివిజన్ సర్టిఫికెట్లు, శానిటరీ, ఫైర్ బక్కెట్లు, టికెట్ల ధరలు, సినిమా హాల్స్‌లో తినుబండారాలు, డ్రింకుల ధరలు, టాయ్‌లెట్ల పరిస్థితులను పరిశీలించారు. పాలకొల్లు పట్టణంలోని మారుతి, అడబాల 12, గీతా అన్నపూర్ణ థియేటర్లను తహసీల్దార్ యడ్ల దుర్గాకిశోర్ తనిఖీ చేసి అన్నీ సక్రమంగానే ఉన్నాయన్నారు. పెనుగొండ మండలం పెనుగొండలోని థియేటర్‌ను తహసీల్దార్ జి. అనితకుమారి తనిఖీ చేసి టికెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గణపవరం మండలం గణపవరంలోని సినిమా థియేటర్లలో ఆర్ఐ గోపికృష్ణ, రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. కుమారి థియేటర్‌లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయని, సీట్లు కొంచెం అసౌకర్యంగా ఉన్నాయన్నారు. నరసాపురం పట్టణంలోని అన్నపూర్ణ, రాజరాజేశ్వరి థియేటర్లలో తహసీల్దార్ ఐవీ సత్యనారాయణ, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ తనిఖీలు చేశారు. మొగల్తూరు మండలం మొగల్తూరులోని చెరుకూరి థియేటర్‌ను తహసీల్దార్ రాజ్‌కిశోర్, తణుకు పట్టణంలో తహసీల్దార్ డీవీ ఎస్ఎస్ అశోక్‌వర్మ, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కు మార్ బృందం థియేటర్లలో తనిఖీ చేశారు. అత్తిలి మండలం అత్తిలిలో గల రెండు థియేటర్లను తహసీ ల్దార్ దశిక వంశీ తనిఖీ చేశారు. ఆకివీడు పట్టణంలోని గంగారత్న, విజయ్ థియేటర్లను తహసీల్దార్ నండూరి వెంకటేశ్వర రావు తనిఖీ చేశారు. థియేటర్లలో శానిటేషన్ అధ్వానంగా ఉందన్నారు. సీట్లు, క్యాంటీన్‌లో తినుబండారాలు, సైకిల్ స్టాండ్‌లు సక్రమం గానే ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం థియేటర్లలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. పలు థియేటర్లలో వున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని ఆయా మండలాల అధికారులు తెలిపారు.

కొంతమంది బడా నిర్మాతల వల్లే నష్టం



సినీ పరిశ్రమలో కొంత మంది బడా నిర్మాల వల్ల థియేటర్ల యాజమాన్యం నష్టపోతుంది. ఆ నిర్మాతలు రాష్ట్రంలో థియేటర్లు లీజుకు తీసుకుని వాళ్ల ఆధీనంలో పెట్టుకుని పవన్ కల్యాణ్ సినిమా విడుదల సమయంలో రాద్ధాంతం చేస్తున్నారు. క్యాంటిన్లకు కూడా వాళ్లే మేనేజ్ చేస్తూ తిను బండారాలు, టిక్కెట్లు అధిక ధరలకు విక్రయాలు చేస్తుండడంతో ప్రజల చేబులకు చిల్లుపడుతున్నాయి. మెయిన్ హీరోల సినిమాలతో పాటు పవన్ సినిమా విడుదల సమయంలో థియేటర్లకు పర్సంటేజ్‌లతో బాగుపడుపోతారనే ఉద్దేశంతో టిక్కెట్లు ధరల దగ్గర గొడవలు సృష్టిస్తున్నారు. థియేటర్లు బంద్ చేస్తే నెలకు కరంటు బిల్లులు, లేబర్ చార్జీలతో రూ.లక్షల్లో నష్టపోతున్నాం.

జీఎస్వీ సత్యనారాయణ, విజయ సినీ కాంప్లెక్స్ జనరల్ మేనేజర్, ఆకివీడు.

క్రైం సమాచారం

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం కందుజాహార్‌కు చెందిన రాబి ముండా(41) తన కుమారుడితో కలిసి కేరళ రాష్ట్రంలోని అలువ నుంచి భువనేశ్వర్‌కు రైలులో వెళుతున్నారు. మార్గమధ్యలో ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తు రాబి ముండా జారిపడి మృతి చెందాడు. ఈ సమాచారం రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఒక గుర్తుతెలియని వృద్ధుడు రైలుపట్టాల వద్దకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు గన్‌బజార్ సెంటర్ దగ్గరలో ఉన్న రైలు పట్టాల వద్దకు సుమారు 60 ఏళ్ల వయస్సు గల ఒక గుర్తు తెలియని వ్యక్తి బుధవారం బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుమారు 5.6 అడుగుల ఎత్తుకల్గి బట్టతల, తెల్లని జుట్టుతో, తెలుపు రంగు శరీరంతో ఉన్నాడు. సంఘటనా స్థలానికి రైల్వే ఎస్ఐ పి.సైమన్, తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఏకారణమో తెలియదు కాని ఒక యువకుడు పంది కొక్కులను సంహరించే గ్యాస్ బిళ్లలను మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండవల్లి మండలం లోకుమూడికి చెందిన అంబటి తంబి(24) దెందులూరు మండలం కొవ్వలి గ్రామ పరిధిలోని ఒక చేపల చెరువుపై పనిచేస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. చేపల చెరువుల గట్లపై పందికొక్కులను సంహరించడానికి పెట్టే గ్యాస్ బిళ్లలు మూడింటిని 27వ తేదీ రాత్రి మింగేశాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దెందులూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

పెంటపాడు, మే 28(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ముదునూరు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం రూరల్ మండలం అరుగొలనుకు చెందిన అడ్డగర్ల సాయిరమేష్(34) అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం పని నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లి తిరిగి మోటారు సైకిల్‌పై అరుగొలను వస్తుండగా ముదునూరు సమీపంలో భీమవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భీమవరం క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై కుమారుడితో కలిసి వెళ్తున్న మహిళ ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. వన్‌టౌన్ ఎస్ఐ కృష్ణాజీ తెలిపిన వివరాలివి.. వీరవాసరం మండలం పంజావేమవరానికి చెందిన కొండమంచిలి మోజెష్, అతని తల్లి మేరీ(35) కలిసి ఈనెల 24న భీమవరంలోని ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొంది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆమె మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో బాలుర మృతదేహాలు లభ్యం

» రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం » కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



కేతా ప్రవీణ్, పాల్‌కుమార్, సూర్యతేజ మృతదేహాలు.. గోదావరిలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఆచంట, మే 28(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక గోదావరిలో మంగళవారం సాయంత్రం స్నానానికి దిగిన ముగ్గురు బాలురు గల్లంతు కాగా బుధవారం ఉదయం లభ్యమయ్యాయి. ఈ ఘటనలో నాగుల్లలంకకు చెందిన కేతా ప్రవీణ్(15), సానబోయిన సూర్య తేజ (12), పెదలంకకు చెందిన నీడిపూడి పాల్ కుమార్(15) మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఇద్దరు బాలురు క్షేమంగా బయటపడ్డారు. గల్లంతైన బాలురు కోసం అధికారులు గోదావరిలో తెల్లవార్లు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలించారు. బుధవారం ఉదయం సుమారు ఆరున్నర ప్రాంతంలో కేతా ప్రవీణ్ మృతదేహం లభ్యం కాగా అనంతరం సానబోయిన సూర్య తేజ మృతదేహం లభ్యమైంది. పదకొండు గంటల సమయంలో కనకాయలంక సమీపంలో నీతిపూడి పాల్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. బాలురు మృతదేహాలకు కోనసీమ జిల్లా రాజోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేశారు. బాలుర మృతదేహాలు లభ్యమయ్యే వరకు ఆచంట, గన్నవరం ఎస్ఐలు కె. వెంకటరమణ, శివ కృష్ణ, తహసీల్దార్‌లు జి.కనకరాజు, శ్రీపల్లవి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను గోదావరి నుంచి తీసుకొచ్చే సమయంలో ఆయా కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా రోధించారు. ఈ ఘటనతో నాగుల్లంకలోని , పెదలంకలోనూ విషాదచాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఘటన తనను ఎంతో బాధించిందన్నారు. బాలుర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఉసురు తీసిన అప్పు..

» ప్రైవేట్ ఫైనాన్షియర్ ఒత్తిడితో ఒకరి ఆత్మహత్య



భాస్కరరావు (ఫైల్)

పెదవేగి, మే 28(ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న అప్పు కుటుంబ యజమాని ఉసురు తీసింది. వాయిదా సొమ్ము వసూలుకు ఫైనాన్స్ సంస్థ చేసిన ఒత్తిడికి ఒక వ్యక్తి అసువులు బాసాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలం కె.కన్నాపురానికి చెందిన కమ్మిలి భాస్కరరావు (35), మనీషా దంపతులకు 3, 4 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతులు ఇద్దరూ వ్యవసాయ కూలీలే. సొంతస్థలంలో పూరింట్లో నివాసం ఉంటూ.. సొంతిల్లు నిర్మించుకోవాలనుకున్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు వచ్చి, ఇంటి నిర్మాణానికి అప్పు ఇస్తామని చెప్పడంతో వారి దగ్గర ఎనిమిది నెలల కిందట రూ.4లక్షలు అప్పు తీసుకుని ఇంటిని నిర్మించుకున్నారు. నెలకు రూ.12వేలు వాయిదా సొమ్ము చెల్లించాలని చెప్పి, రూ.4లక్షలు ఇచ్చారు. క్రమం తప్పకుండా ఏడు నెలల వాయిదాలు సకాలంలో చెల్లించారు. ఈనెల మొదట్లో 8వ నెల వాయిదా సొమ్ము చెల్లించాల్సి ఉంది. నగదు సమకూరకపోవడంతో వాయిదా సొమ్ము కట్టలేకపోయారు. దీంతో ఏలూరుకు చెందిన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు మంగళవారం కె.కన్నాపురం ఇంటికి వచ్చి వాయిదా సొమ్ము కట్టనందుకు దురుసుగా ప్రవర్తించారు. వచ్చే నెలలో మొత్తం కట్టేస్తామని ప్రాథేయపడినా వారు వినకుండా గట్టిగా నిలదీశారు. దీంతో మనస్తాపానికి గురైన కమ్మిలి భాస్కరరావు మంగళవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు రాత్రంతా వెతికినా కనిపించలేదు. బుధవారం ఉదయం గ్రామం సమీపంలోని కోకో తోటలో చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. దీనిపై మృతుడి భార్య మనీషా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. మృతుని తండ్రి, సోదరుడు ఇద్దరూ కూడా గతంలోనే మరణించారు. భాస్కరరావు భార్య, పిల్లలతోపాటు తల్లికూడా అతడిపైనే ఆధారపడి ఉన్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

» చించినాడ బ్రిడ్జిపై బైక్, సెల్‌ఫోన్ గుర్తింపు

యలమంచిలి, మే 28(ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం తాడేరుకు చెందిన యువ కుడు షేక్ లాల్‌మహ్మద్ మంగళవారం సాయం త్రం నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన లాల్‌మహ్మద్ మంగళవారం సాయంత్రం తన ఇంటినుంచి బయటకు వెళ్లాడు. సుమారు ఏడు గంటల సమయంలో అతడి కుటుంబసభ్యులు ఫోన్ చేయగా యువకుడి ఫోన్ లిఫ్ట్ చేసిన వ్యక్తి సెల్‌ఫోన్, బైక్ చించినాడ బ్రిడ్జిపై ఉన్నాయని చెప్పాడు. వెంటనే అతడి కుటుంబసభ్యులు చించినాడ బ్రిడ్జిపైకి చేరుకుని అక్కడ ఉన్న బైక్ యువకుడిదేనని గుర్తించి చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి బావాలిషా పోలీసులకు ఫిర్యాదుచేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరిలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని ఎస్ఐ తెలిపారు.

త్వరలో ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 48 మండలాల పరిధిలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక ప్రాతిపదికన సమీప ప్రాంతాల్లోనే వర్క్ అడ్జస్టమెంట్‌పై నియమించడానికి ఉద్దేశించిన కౌన్సెలింగ్ మార్గదర్శకాలను లిఖితపూర్వకంగా పంపించాలని సీఎఫ్‌డబ్ల్యూ కార్యాలయాన్ని డీఎంహెచ్‌వో ఆఫీసువర్గాలు కోరాయి. పని సర్దుబాటుపై నియమించేందుకు ఇటీవల 252మందితో కూడిన ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగుల సీనియార్టీ జాబితాను విడుదల చేసిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించింది. తుది సీనియార్టీ జాబితాను విడుదల చేసి కౌన్సెలింగ్ చేపట్టడానికి సమాయత్తమవుతున్న దశలో ఉద్యోగుల నుంచి వేర్వేరుగా అభ్యంతరాలు, సూచనలు, అభ్యర్థనలు వచ్చాయి. ముఖ్యంగా ఉద్యోగి నియామకం జరిగిన తేదీ లేదా సర్వీసు క్రమబద్ధీకరణ తేదీలలో దేనిని కౌన్సెలింగ్ సీనియార్టీకి ప్రామాణికంగా తీసుకోవాలన్న దానిపై సందిగ్ధత ఏర్పడింది. వీటన్నింటినీ రాష్ట్ర అధికారుల ఎదుట ప్రస్తావించి వివరణను కోరారు. మౌఖికంగా రాష్ట్ర అధికారులు వివరణలు ఇవ్వడంతో వాటిని లిఖితపూర్వకంగా ఇవ్వాలని జిల్లా అధికారులు అభ్యర్థించగా, ఆ మేరకు కొద్దిరోజుల్లోనే వాటిని పంపుతామన్నారు. తాజాగా మార్గదర్శకాలు అందిన తర్వాత కొద్దిరోజుల్లోనే పని సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు తెలిపాయి.



అడవిపాలెంలో బోల్తాపడిన ట్రాక్టర్

లారీ ఢీకొని తిరగబడిన ట్రాక్టర్

యలమంచిలి, మే 28(ఆంధ్రజ్యోతి): అడవిపాలెం గ్రామంలో ప్రధానరహదారి పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఇసుకలోడుతో వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ తిరగబడింది. ట్రాక్టర్‌పై ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. మట్టి, ఇసుక లోడుతో వెళుతున్న లారీలు మితిమీరిన వేగంతో వెళుతున్నాయని.. రోడ్డుపైకి వెళితే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం కలుగుతుందని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

గొలుసు తస్కరించిన ముగ్గురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,మే 28 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని అయ్యన్న కాలనీలో ఉంటున్న కుందా జానకీదేవి కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో మంగళసూత్రాలు తస్కరించిన ఘటనలో నేరానికి పాల్పడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేశామని డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 23న స్థానిక అయ్యన్న కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ టీచర్లైన కుందా శ్రీరామశాస్త్రి, జానకీదేవి ఇంటికి తాపీపని నిమిత్తం వచ్చిన ముగ్గురు యువకులు ఇంటి యజమాని బయటకు వెళ్లిన సమయంలో యజమానురాలు జానకీదేవి కళ్లల్లో కారం కొట్టి మెడలో బంగారు మంగళ సూత్రాల తాడు దొంగతం చేసి పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసులోని ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు బంగారు మంగళసూత్రం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఇంతకు ముందు నేర చరిత్ర లేదన్నారు. వీరిపై చార్జిషీట్ ఓపెన్ చేసి కదలికలపై నిఘా పెడతామని, నేరస్తులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. సీఐ కృష్ణబాబు, ఎస్ఐ ఎస్కే జబీర్, ఏఎస్ఐ సంపత్ పాల్గొన్నారు.

రైతులు ఫారం పాండ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి

పెదపాడు, మే 28(ఆంధ్రజ్యోతి) : రైతులంతా తప్పనిసరిగా ఫారం పాండ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఫారం పాండ్స్ ఏర్పాటుకు అర్హత కలిగిన రైతులను గుర్తించి బుధవారం వారికి అవగాహన కల్పించారు. వీటిని ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేయనున్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ ద్వారా పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వో కరణ్, పశువైద్యాధికారి సీహెచ్ వాణిసంధ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు కొనసాగుతున్న శిక్షణ

పెదవేగి/ఏలూరు టూటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు పాల్గొని చిన్నారులకు పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని సముపార్జించాలనే ఆయన సూచించారు. పెదవేగి శాఖాగ్రంథాలయం గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆటపాటలతో విద్యనభ్యసించాలన్నారు. శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన పాల్గొని పుస్తక పఠనంపై శిక్షణనిచ్చారు.

షెడ్యూల్ ప్రకారమే టీచర్ల బదిలీలు నిర్వహించాలి

ఏలూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీల ప్రక్రియను షెడ్యూల్ ప్రకారమే నిర్వహించకుండా ఉన్నతాధికారులు గందరగోళం సృష్టిస్తున్నారని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆరోపించారు. బదిలీకి ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి స్థాయిలో డిజైన్ చేయకపోవడం వల్ల అప్లికేషన్ పెట్టుకునే సమయంలో గందరగోళానికి లోనవుతున్నారని వివరించారు. షెడ్యూల్‌కు అనుగుణంగా ఇంతవరకు సీనియార్టీ జాబితాలను విడుదల చేయలేదని, దీనివల్ల తమ పేరు ఎక్కడుందోనని టీచర్లు ఒత్తిడికి లోనవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే బదిలీల ప్రక్రియను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రాణాంతక వ్యాధుల నుంచి టీకాలతో బిడ్డలకు భద్రత

ఏలూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తమ బిడ్డలకు నిర్ణీత సమయంలోనే వ్యాధి నిరోధక టీకాలు వేయించినప్పుడే పది రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి భద్రత ఉంటుందని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. బుధవారం స్థానిక జేపీ కాలనీ, జలాపహరేశ్వరస్వామి అర్బన్ పీహెచ్‌సీల్లో టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. క్షయ, పోలియో, అతిసార, కోరింతదగ్గు, ధనుర్వాతం, రేచీకటి నిర్మూలనకు టీకాలు ఉచితంగా వేస్తారని, మొత్తం మీద 16 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు టీకాలు వేయాల్సి ఉంటుందన్నారు. డాక్టర్ నీలిమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అహల్యా బాయి హోల్కర్ జయంతి

ఏలూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): మరాఠా వీరనారి ఇండోర్ మహారాణి దేవి, రాజమాత అహల్యా బాయి హోల్కర్ జయంతిని ఈ నెల 30న ఏలూరు టుబాకో మర్చంట్ హాల్లో నిర్వహిస్తున్నట్టు బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.విక్రమ్‌కిశోర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. దేశచరిత్రలో సుపరిపాలనకు ప్రతీరూపంగా నిలిచిన మరాఠారాణిని సర్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇలపకుర్తి కుసుమ కుమారి, గాది రాంబాబు, భాడిత నారాయణరావు, నాగమోహన్, లక్కోజు అనిల్ ఆచార్య, అగ్రహారపు వెంకటేశ్వరరావు, నెక్కంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లంతా షాపులు సిద్ధం చేసుకోవాలి

దెందులూరు, మే 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని రేషన్ షాపులను డీలర్లు సిద్ధం చేసుకోవాలని దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి అన్నారు. దెందులూరు మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ షాపులను బుధవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా సుమతి మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద కొత్త బోర్డులను పెట్టాలని, ఈ పాస్ ఇచ్చేందుకు వేయింగ్ మిషన్ పని చేసేలా సిద్ధం చేసుకోవాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపు తెరిచి ఉంచాలన్నారు. 65 సంవత్సరాలు దాటి రేషన్ దుకాణానికి రాలేని వృద్ధుల లిస్టులు తయారు చేయాలన్నారు.

ధాన్యం మద్దతు ధర పెంపు కంటి తుడుపే

పెదపాడు, మే 28(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్, రబీ పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర రైతుకు ఏ మాత్రం సరిపోదని, క్వింటాలుకు రూ.69 పెంపు కంటి తుడుపు చర్యేనని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. వట్లూరులోని గ్రంథాలయం ఆవరణలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మద్దతు పెంపుపై సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ధాన్యం క్వింటాలుకు రూ. 3 వేలు కనీస మద్దతు ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్యం మేరకు మట్టి నమూనాల సేకరణ

పెదపాడు, మే 28(ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల నిర్దేశిత లక్ష్యాల మేరకు మట్టి నమూనాలు సేకరించి ఫలితాల కోసం నూజివీడు పరీక్షా కేంద్రాలకు పంపనున్నట్టు డీఏవో ఎస్.కె.హబీబ్ బాషా తెలిపారు. పెదపాడు గ్రామంలో జరుగుతున్న మట్టి నమూనా కార్యక్రమాన్ని హబీబ్ బాషా బుధవారం పరిశీలించారు. మట్టి నమూనాల కోసం మట్టి సేకరణలో పాటించాల్సి జాగ్రత్తలు, మెలకులను సిబ్బందికి వివరించారు. ఇప్పటి వరకూ 1,300మట్టి నమూనాలు సేకరణ లక్ష్యం కాగా 1,286 సేకరించామని, వీటిని ఖరీఫ్ నాటికి పరీక్షా ఫలితాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్బారావు, ఏవో ప్రదీప్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన సదస్సు

ఏలూరు టూటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై ఆశ్రం ఆసుపత్రిలో వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం మహిళా చట్టాల ద్వారా కల్పిస్తున్న సేవలను వివరించారు. అత్యవసర సేవల కోసం 112, సైబర్ మోసాల నివేదికల కోసం 1930, బాలల హెల్ప్ లైన్ కోసం 1098, మహిళల హెల్ప్‌లైన్ కోసం 181 ఫైర్ ఎమర్జెన్సీ కోసం 101వంటి టోల్‌ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిపై విస్తృత అవగాహన కల్పించారు. శక్తి యాప్‌పై పూర్తి అవగాహన కలిగించారు. మహిళలు ఎటువంటి ప్రమాదస్థితిలో అయినా భయపడకుండా పోలీస్ శాఖకు(112) సమాచారం అందించాలన్నారు.

పీసా కమిటీ తీర్మానాలను అమలు చేయాలి

వేలేరుపాడు, మే 28(ఆంధ్రజ్యోతి) :గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటైన పీసా కమిటీల తీర్మానాలకు వ్యతిరేకంగా అధికారులు చర్యలు చేపట్టవద్దని ఏకమిటీకైనా పీసా కమిటీ తీర్మానం చేసిన తరువాతే అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకోవాలని వేలేరుపాడు మండలంలోని పీసా కమిటీల కార్యవర్గం అధికారులను కోరారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ ఏఈకి ఈ మేరకు ఒక మెమొరాండం అందించారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లను నిర్మిస్తున్నారని అలా నిర్మిస్తున్న ఇళ్లకు పీసా కమిటీల తీర్మానం మేరకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు విరుద్ధంగా అధికారులు పని చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీసా కమిటీల ద్వారా కేసులు పెట్టడం జరుగుతుందని సూచించారు.

జిల్లాలో సరాసరి 14.7 మి.మీ. వర్షపాతం నమోదు

ఏలూరుసిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిపించింది. జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం విలీన మండలాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో కుంభవృష్టిగానే వర్షాలు కురిశాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 89 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 14.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో రైతులు సార్వా సాగుపై దృష్టి సారించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరి నారుమళ్ల పనులు సాగుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో సైతం వ్యవసాయ పనులకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

జనావాసాల్లో పందుల సంచారం లేకుండా చూడండి

ఏలూరు, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జనావాసాల్లో పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో పందుల నియంత్రణ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ప్రజారోగ్యానికి ఎటువంటి భంగం కలగకుండా పందుల పెంపకాన్ని జనావాసాల నుంచి ఊరి చివరికి పశువుల షెడ్డు ఏర్పాటు చేసి తరలించాలన్నారు. ఏలూరు కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ నగరంలోని పోణంగి కంపోస్టుయార్డు వద్ద పందుల పెంపకానికి కొంత స్థలం గుర్తించామన్నారు. డీఎంహెచ్‌వో మాలిని, తహసీల్దార్ జీవి శేషగిరిరావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లలో యథేచ్ఛగా మట్టి తరలింపు



ఉంగుటూరు/పోలవరం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు, పోలవరం మండలాల్లో దాళ్వా పూర్తవడంతో రైతులు తమ చేలల్లో మెరక పనుల కోసం మట్టి తరలింపు పనులు చేపట్టారు. మితిమీరిన వేగతంతో వెళ్తూ మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ విషయమై ఉంగుటూరు వీఆర్వోను వివరణ కోరగా మట్టి తోలకాలకు అనుమతులు లేవన్నారు. మరోవైపు పోలవరం మండలం పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ కాలువ పూడిక మట్టిని పంట పొలాలకు తరలించేందుకు అనుమతులివ్వడంతో ట్రాక్టర్లపై రేయంబవళ్లు తరలిస్తున్నారు.



పెదనింద్రకొలనులో నాయకుల నివాళి



ఉంగుటూరు సెంటర్లో నివాళులర్పిస్తున్న నాయకులు



చింతలపూడిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

అధికారికంగా నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం - నివాళులర్పించిన నాయకులు, అధికారులు

ఏలూరు/ ఏలూరు క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి) : దేవుడి పాత్రల్లో నటించి దివంగత ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కొనియాడారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో మాజీ సీఎం నందమూరి తారకరామారావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, కార్పొరేషన్ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ జీవిత చరిత్రను స్ర్కీన్‌పై ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందర్ని ఆకట్టుకుంది. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, శ్రీశ్రీ విద్యాసంస్థ చైర్మన్ ఎంబీఎస్ శర్మలు మాట్లాడారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టర్‌తో పాటు ప్రజలు తిలకించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, సెట్వెల్ మేనేజర్ సత్యనారాయణ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ పట్టాభి పాల్గొన్నారు. ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎఆర్ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐలు భాస్కరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

● దెందులూరు మండలం కొవ్వలి గ్రామ మాజీ సర్పంచ్, సాగునీటి వినియోగదారుల సంఘం(గోదావరి కాల్వ డీసీ) చైర్మన్ వెలమాటి రాంబాబు, కొవ్వలి టీడీపీ గ్రామాధ్యక్షుడు బగాతి చిన్నారావు, గ్రామ ఉపాధ్యక్షుడు గోవాడ నాగరాజు, కార్యదర్శి బోడా రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు వెలమాటి మోహన్ కృష్ణ, గద్దే అమరేశ్వరరావు, మాజీ ఎంపీపీ పి.సుశీల, జనార్దనరావుల ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బి.విజయ్‌కుమార్, గారపాటి శ్రీను, అలపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

● ఉంగుటూరు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, స్థానిక సర్పంచ్ బండారు సింధు, బండారు మధు, నారాయణ హనుమంతు, ఇర్లపాటి మోషే, ఎంపీడీవో రాజ్ మనోజ్ పాల్గొన్నారు. తెలుగు యువత నాయకుడు రెడ్డి చందు నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వల్లభనేని శివ, కైకరం సెంటర్లో టీడీపీ గ్రామాధ్యక్షులు యెగ్గిన పెదబాబు, సర్పంచ్ సలగాల గోపి పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

● ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం, పావులూరి వారి గూడెం, ద్వారకాతిరుమల, జి.కొత్తపల్లి, మారంపల్లి, దొరసానిపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి, చిత్ర పటాలకు పార్టీనేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నేతలు పోలిన శ్రీనివాసరావు,పావులూరి మధు, ఘంటా శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, ఎంపీటీసీ కొయ్యలమూడి సరిత, రేగంటి రాంబాబు, రేపూరి వెంకటేశ్వరరావు, బాలు, దాలయ్య, ఘంటా శ్రీని వాసరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం మండలం కె.ఆర్. పురం ఐటీడీఏ కార్యాలయంలో పీవో కె.రాములు నాయక్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పి.వి.చలపతిరావు, కొమ్ముగూడెంసెంటరు, రెడ్డిగణపవరంలో నాయకులు యంత్రప్రగడ శ్రీనివాసరావు, కలగర రాము, గద్దె అబ్బులు, కుందుల శ్రీను, షేక్ బాజీ, ఎం.బాలు, ఎం.మోజేష్, శ్రీనివాస్, ఫణికిషోర్, బి.ఎలీషా పాల్గొని నివాళులర్పించారు.

● చింతలపూడి మేడబడి సెంటర్‌లో టీడీపీ నాయకులు టి.అప్పారావు కేక్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ప్రగడవరంలో నాయకులు నివాళులర్పించారు. ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో నాయకులు కె.శేషగిరిరావు, చిట్లూరి ధర్మరాజు, బోడ నాగభూషణం, అనీష్ కుమార్, దేవ, టి.రామా రావు పాల్గొన్నారు.

● ఏలూరురూరల్ పరిధిలో ఎంపీడీవో వెన్న శ్రీలత, చాటపర్రు తహసీల్దార్ కార్యాలయంలో ఎ.శ్రీని వాసరావులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. వెలుగు ఏపీఎం నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, ఉపాధి ఏపీవో బషర్తుల్లా, పంచాయతీకార్యదర్శులు నివాళులర్పించారు.

● నిడమర్రు మండలం పెదనింద్రకొలను,నిడమర్రు, పత్తేపురం, అడవికొలను, చానమిల్లి, క్రొవ్విడి గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మేకా వెంకటరమణ, పోశింశెట్టి రామ్మూర్తి, టేకుమూడి లక్ష్మణరావు, పైడికొండల శివాజీ, అడ్డాడ రఘు, సారికె లెనిన్‌బాబు, తమ్మిశెట్టి మురళీకృష్ణ, చిన్నం ముసలయ్య, టి.కాశీ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి టీడీపీ మండలాధ్యక్షుడు సుంకవల్లి సాయి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.బర్రింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయంతో పాటు పలు గ్రామాల్లో కేక్ కట్ చేశారు. ఆయా గ్రామాల్లో ఎంపీటీసీ నాలి శ్రీను, జి.లక్ష్మీనారాయణ, సి.హెచ్.శ్రీనివాసరావు, వెలగల అజయ్, గూడపాటి పుల్లయ్య, శివాజీ ఉన్నారు. పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో, ఏటిగట్టు సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, సీనియర్ నేత కుంచే దొరబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. టీడీపీ మండల నాయకులు నునకాని రాంబాబు, పోతుల శ్రీను, మంగిన కొండ, తెల్లం సూర్యచంద్రం, పి.ప్రసాద్, కుంజం సుభాషిణి, జల్లేపల్లి వెంకట నరసింహరావు, యడ్ల వినోద్, పిల్లి నాగ రాజు, గంధం రాము, ఆకుల రాజా, కొత్తపల్లి సత్యనా రాయణ, బండారు శ్రీనివాసరావు, కంభంపాటి గోపి, కోడి పోసిబాబు, రెల్లి కొండబాబు, పైలా అబ్బులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిశోర్, నంబూరి రామచంద్రరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అలాగే భారీ ర్యాలీ నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు బొబ్బర రాజ్‌పాల్ కుమార్, తూటిగుంట రాము, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, బూరుగుపల్లి సూరిబాబు, చిట్రోజు తాతాజీ, కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ యాకూబ్, కంచర్ల గణేష్, మానికల నాగేశ్వరరావు, జగత్ పాల్గొన్నారు. లక్కవరంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు గద్దే బాబీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

● లింగపాలెం ప్రధాన సెంటర్‌లో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు, పాతూరి శ్రీను, తాళం సోంబాబు, చెన్ను శ్రీనివాస్ యాదవ్, జి వెంక టేశ్వరరావు, పల్లి శ్రీను పాల్గొన్నారు.

● పెదవేగి తహసీల్దారు కార్యాలయంలో ఎస్.డి. భ్రమరాంబ, ఆర్ఐ కేబీవీ. సారథి, సర్వేయర్ సత్యనారాయణమూర్తి, వీఆర్వోలు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఏలూరు శాంతి నగర్‌లోని ఎంపీ పుట్టా మహేశ్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎం.చింతయ్య, ఆలూరి రమేశ్, తెనాలి సురేశ్, ప్రతాప్, రాఘవులు పాల్గొన్నారు.

● ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భాను ప్రతాప్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, మేనేజర్ మూర్తి, రెవెన్యూ ఆఫీసర్ సిరాజ్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పీవో మహలక్ష్మి, మునిసిపల్ ఇంజనీర్ సురేంద్రబాబు, ఆర్వోలు శోభా, భారతి, అరుణ, ఆర్ఐలు నాగరాజు, సాయి పవన్, గాంధీ, రమేశ్ పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు, నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, ఈతకోట శ్రీనివాస్, జంపా సూర్యనారాయణ, నాయుడు సోము, భీమవరపు సురేశ్, జుంజు మోజేశ్, నెరుసు గంగరాజు నివాళులర్పించారు.

● పెదపాడు ఎంపీడీవో కార్యాలయంలో పార్టీ గ్రామాధ్యక్షులు బొప్పన బాబ్జి, ఆగోళ్ళ కృష్ణారావు, ఖండవల్లి జరహో, గారపాటి మోహన్, ఎంపీడీవో, తహసీల్దారు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

● వేలేరుపాడు ఎంపీడీవో కార్యాలయంలో శ్రీహరి, తహసీల్దార్ కార్యాలయంలో డి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సంజీవులు, కొమ్మన వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం మండలం తెడ్లంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించగా ముప్పన శ్రవంతి రమేశ్ రెడ్డి, కేతిరెడ్డి వీరారెడ్డి, బండి శ్రీనివా సరావు, జలమర్తి భాను ప్రసాద్, నాగదేశ శౌరి, ప్రసాద్ పాల్గొన్నారు.

● కుక్కునూరులోని రామాలయం సెంటర్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, హరిబాబు, రమణరాజు పాల్గొన్నారు.



ఐటీడీఏలో నివాళులర్పిస్తున్న పీవో రాములు నాయక్



భీమడోలులో నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థినుల సర్టిఫికెట్ల పరిశీలన

బుట్టాయగూడెం, మే 28(ఆంధ్రజ్యోతి) : బూసరాజుపల్లి ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు సీట్లను కేటాయించడానికి బుధవారం కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనను ప్రిన్సిపాల్ శేష చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెరిట్ ప్రాతిపదికన సీట్లను కేటాయించారు. భర్తీకాని సీట్లను ఈ నెల 30న మరోసారి సర్టిఫికెట్లు పరిశీలించి పూర్తి చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. వందల సంఖ్యలో విద్యార్థినులు కౌన్సెలింగ్‌కు రాగా పదుల సంఖ్యలో సీట్లు భర్తీ కావడంతో నిరాశతో తల్లిదండ్రులు వెనుదిరిగారు. కళాశాలలో సీట్లను పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ఏపీఎన్జీవో నేతల కృతజ్ఞతలు

ఏలూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెట్రిసెల్విని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఇటీవల ఉద్యోగులకు సంబంధించిన సాధారణ బదిలీలకు సంబంధించి జీవో 23ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ జీవో ప్రకారం బదిలీలు కలెక్టర్ పారదర్శకంగా జరిపించాలని కోరారు. దీంతో కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారికి తగిన ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఇటీవల గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి మేరకు సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశాలిచ్చి ఏఎన్ఎంలకు పదోన్నతులు ఫైల్‌ను ఆమోదించిన సందర్భంగా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ఎన్జీవోస్ నాయకులు ఉన్నారు.

టి.నర్సాపురం గ్రామ కమిటీ ఎన్నిక

టి.నర్సాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికార ప్రతినిధి కొల్లి మురళీ నివాసం వద్ద టి.నర్సాపురం గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లి రమేశ్, ఉపాధ్యక్షుడిగా సందేపూడి సాయి, కార్యదర్శి జోనుబోయిన శేషారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కొల్లి రమేశ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టి.నర్సాపురం జలవనరుల సంఘ అధ్యక్షులు కొనకళ్ల మోహన్ కుమార్, మాజీ సర్పంచ్ జోనుబోయిన సోమబాబు, అద్దంకి జగ్గారావు, గంధం సీతయ్య, వేములయ్య, కిలారు సాంబశివరావు, కాకాని గంగరాజు, కొక్కొండ ఈశ్వరాచారి, తదితరులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

నిడమర్రు, మే 28(ఆంధ్రజ్యోతి) : పేద బడుగు బలహీన వర్గాలకు విద్య, వైద్య సేవలు అందించడంలో మానవత సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని మానవత రాష్ట్ర అభివృద్ధి, విస్తరణ కన్వీనర్ జానకి రామరాజు పేర్కొన్నారు. బుధవారం నిడమర్రు మండల మానవత నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. సమావేశం అధ్యక్షులు కిలారి రవి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మానవత నిడమర్రు మండల నూతన అధ్యక్షుడిగా వన్నెంరెడ్డి పరమేశ్, కార్యదర్శిగా అల్లుమోలు నరసింహమూర్తి, ట్రెజరర్‌గా సంకు శ్రీనివాసరావులను మండల కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మానవత సభ్యులు వెల్లంకి నరేశ్ కుమార్, నౌడు అచ్యుత రామారావు, మంత్రబుడ్డి అప్పారావులు పాల్గొన్నారు.

రావులపర్రు వంతెనకు మోక్షం

ఉంగుటూరు, మే 28(ఆంధ్రజ్యోతి) : రావులపర్రు నుంచి ఉంగుటూరుకు వెళ్లే రహదారిలో ఉన్న వంతెన 2019లో కూలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మరాజు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.70 లక్షలు మంజూరు చేయించారు. దీంతో వంతెన శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ రహదారి విభాగం ఏ.ఈ. భాస్కర్ మాట్లాడుతూ ఈ నిర్మాణం ద్వారా దొంతవరం, రాచూరు, రావులపర్రు, తదితర గ్రామాల ప్రజల కష్టాలు తీరతాయని ఆశిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు డ్రోన్‌తో చెక్

» పరిశీలించిన డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, మే 28(ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై డ్రోన్ కెమెరాతో చెక్ పెట్టనున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌కు డ్రోన్ కెమెరా అందజేయడంతో దాని పని తీరును డీఎస్పీ కార్యాలయం వద్ద ఎస్.ఐ. జబీర్ ఆపరేట్ చేయగా డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రోన్ కెమెరాతో ఖాళీ మైదానాల్లో మద్యం తాగే వారిని, పేకాట స్థావరాలను, అల్లరి మూకలను సులభంగా గుర్తించవచ్చన్నారు. సుమారు రెండు కిలో మీటర్ల పరిధిలో ఈ డ్రోన్‌ను ఆపరేట్ చేయవచ్చన్నారు. అసాంఘిక కార్యకలాపాలన్నిటినీ హెచ్‌డీ క్వాలిటీలో ఈ డ్రోన్ రికార్డు చేస్తుందన్నారు. రానున్న కాలంలో ప్రతీ సర్కిల్‌కు ఒక డ్రోన్ ఇవ్వనున్నట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటాం

జీలుగుమిల్లి, మే 28(ఆంధ్రజ్యోతి) : పోలవరం నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెలే చిర్రి బాలరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, పలు శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పీవో రాములు నాయక్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ, తహసీల్దారు ఉదయ్ భాస్కర్, ఎంపీడీవో నిఖిల్ మధు శరణ్, ఏపీవో జాన్‌వెస్లీ ఉన్నారు.

సచివాలయాల్లో యోగాపై అవగాహన

లింగపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి) : విశాఖలో జూన్ 11న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో అని సచివాలయాలు, పంచాయతీ సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు. మండల విస్తరణాధికారి జేఎం రత్నకుమార్ మాట్లాడుతూ యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగా వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. యోగాతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



దోసపాడులో గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

దోసపాడులో పోలీసుల పల్లెనిద్ర

దెందులూరు, మే 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేదవేగి సీఐ వెంకటేశ్వరరావు, దెందులూరు ఎస్ఐ శివాజీ తెలిపారు. పోలీస్ శాఖ కేవలం ప్రజల రక్షణకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరితో మానవీయ సంబంధాలు కలిగి ఉండేలా పని చేస్తున్నట్టు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. అత్యవసర సేవలకు 112 కాల్ చేయాలని, దోసపాడు గ్రామ పరిధిలో ఎలాంటి రహస్య సమాచారం ఉన్నా ఎస్పీ(95503 51100) వాట్సాప్‌కు మెసేజ్ పెట్టాలన్నారు. సైబర్ నేరాలపై 1930 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి) : చాటపర్రు సెక్షన్ పరిధిలోని 11 కేవీ చాటపర్రు - జాలిపూడి ఫీడర్ పరిధిలో జాలిపూడి, మాధవపురం, మొండికోడు, 11 కేవీ కొమడవోలు - పొరెపల్లి పరిధిలోని కొమడవోలు, హమాలీ కాలనీ, దుర్గా గ్రాండ్ సిటీ, అండాలమ్మ తోట, రామనగర్, మారుతీనగర్, మస్తాన్ మన్యం కాలనీ,నాగేంద్రకాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రీ కాలనీ, చెంచుల కాలనీ, ఆటో నగర్, కొమడవోలు, తూర్పు లాకులు, సాయి నగర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ కోరారు.

పెదవేగి పరిధిలో..

పెదవేగి : పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నారని, ఈ కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అంబేడ్కర్ తెలిపారు. పెదవేగితో పాటు లక్ష్మీపురం, సూర్యారావుపేట, సీతాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విజయరాయి పరిధిలో రెండ్రోజులు..

విజయరాయి పరిధిలోని జానంపేట విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారం రెండ్రోల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అంబేడ్కర్ తెలిపారు. జానంపేటతోపాటు జగన్నాధపురం, జ్ఞానేసుపురం, బిసింగవరం గ్రామాల పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రంగాపురం పరిధిలో..

లింగపాలెం : రంగాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు అంబేడ్కర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన కోరారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, మే 28(ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 2వ తేదీన రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు.స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి కార్యాచరణను ప్రకటించారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నిర్వహించే ధర్నాకు అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

మేట్లకు వేతనాలు పెంచాలి

టి.నర్సాపురం, మే 28(ఆంధ్రజ్యోతి) :ఉపాధి హామీ పనుల్లో కీలకపాత్ర పోషిస్తున్న సీనియర్ ఉపాధి మేట్లకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలోని చాకలి చెరువులో ఉపాధి పని ప్రదేశంలో పర్యటించిన వ్యవసాయ కార్మిక సంఘం బృందం సమస్యలపై కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మడకం కుమారి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కుమారి బాధ్యతలు

టి.నర్సాపురం, మే 28(ఆంధ్రజ్యోతి) : టి.నర్సాపురం ఎంపీడీవోగా గారపాటి నగరాజ కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో భీమడోలు మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారిణిగా పనిచేస్తూ పదోన్నతిపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నగరాజ కుమారికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

బాల సదనం పరిశీలన

దెందులూరు మే 28 (ఆంధ్రజ్యోతి) : బాల సదనంలో ఉన్న బాలికలు క్రమ శిక్షణతో చదువులో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని దెందులూరులోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని(బాలసదనం)ను న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ పరిశీలించారు. బాలికలకు వసతి గృహంలో అందుతున్న సదుపాయాలను బాలసదనం సూపరింటెండెంట్ ఎస్ బేబి సరోజిని వివరాలడిగి తెలుసుకున్నారు.

బ్రహ్మదేవుడిని ఆరాధించాలి

ఏలూరు కార్పొరేషన్, మే 28(ఆంధ్రజ్యోతి) : జ్యేష్ఠ మాసం అన్నిమాసాల కంటే ఎంతో విశిష్టమైందని టీటీడీ స్వర్ణపతాక గ్రహీత కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు తెలిపారు. రామచంద్రరావుపేటలోని కోదండ రామాలయం వద్ద ఆయన మాట్లాడుతూ జ్యేష్ఠమాసం బ్రహ్మదేవునికి ఎంతో విశిష్టమైందిగా పురాణాలు చెబుతున్నాయన్నారు. ఈ మాసంలో బ్రహ్మదేవుడిని ఆరాధిస్తే సులభంగా అనుగ్రహిస్తాడని అన్నారు. బ్రహ్మదేవుని ప్రతిమను గోదుమ పిండితో తయారు చేసి జ్యేష్ఠమాసమంతా పూజించడం వల్ల విశేషమైన ఫలితాలను పొందవచ్చని ఆధ్యాత్మిక గ్రంథాలు తెలియజేస్తున్నాయన్నారు.

మలబార్ సేవలు ప్రారంభం

ఏలూరు రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థనిరాశ్రయుల ఆకలి తీర్చేందుకు 'హంగర్ ఫ్రీ వరల్డ్' కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ నాగేంద్రకుమార్ ప్రారంభించారు. కనిపెంచిన తల్లిదండ్రులు అనాథలు కాకూడదనే ఉద్దేశంతో నిరాశ్రయులకు భోజనం, వసతి, మందులు, దుస్తులిచ్చి ఆదుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. తమ సంస్థ ద్వారా 150 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు హెడ్ జైనుద్దీన్ తెలిపారు.

చాట్రాయి సెంటర్‌లో నిలుస్తున్న వర్షం నీరు



చాట్రాయి, మే 28(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షానికి చాట్రాయి మెయిన్ సెంటర్‌లో వైయస్సార్ విగ్రహం వద్ద నీరు నిలుస్తుండటంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైయిన్లు పూడుకుపోవటం వలన వర్షం నీరు నిలుస్తున్నదని, వర్షాకాలంలో అపరిశుభ్రత తాండవించే పరిస్థితి ఉన్నదని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు నూజివీడులో జాబ్ మేళా

నూజివీడు టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్ర తెలిపారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి నుంచి పీజీ, బీటెక్ వంటి విద్యార్హతలు ఉన్న 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి లక్ష మల్లెల అర్చన



ముదినేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): సింగరాయ పాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివార్లకు లక్ష మల్లెల కుసుమార్చన నిర్వహించారు. స్వామి వారికి మహన్యాన పూర్వక రుద్రాభిషేకం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాగప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏపీవోగా ఖాజావలి

ఆగిరిపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి ఏపీవో మీనాక్షి నూజివీడుకు బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా, ఉంగుటూరు మండలంలో ఏపీవోగా పనిచేస్తున్న ఖాజావలి బదిలీలో భాగంగా ఆగిరిపల్లి మండలం ఏపీవోగా రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.



నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

ప్రజా సమస్యలపై అవగాహన ఉండాలి

నూజివీడు, మే 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ అన్నారు. బుధవారం నూజివీడులో నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా బూత్ కమిటీల నిర్మాణం, శక్తి కేంద్రాల ఏర్పాటుపై బాధ్యులు దృష్టి పెట్టాలన్నారు. ఆగిరిపల్లి, నూజివీడు రూరల్ మండలాలల్లో బూత్ కమిటీలను మండల కమిటీల నియామకం ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా కన్వీనర్ కటినేని కృష్ణప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ జీఆర్‌కే రంగరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్, జిల్లా కోశాధికారి ఎం.రవికాంత్, నాయకులు వైఎస్ దొరై, అప్పారావు, శివరాజు, వసుంధరదేవి, శ్రీనివాస కుమార అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ముదినేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ముదినేపల్లిలో బుతుక్రమం ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శాంతిశ్రీ, స్వేత ఆధ్వర్యంలో వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఈ ర్యాలీని నిర్వహించి మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారంపై అవగాహన కల్పించారు.

చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ముదినేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామ పంచాయతీ చెరువు ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్టూరి వీర వెంకట సత్యనాంచారయ్య కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం కలెక్టర్‌కు ఒక వినతి పత్రాన్ని పంపారు. గ్రామ ఏరియాలోని ఆర్ఎస్ నెంబరు 34-1లో 2-35 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊర చెరువులో కొంత భాగం, పక్కనే ఉన్న 62 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించి చేపల చెరువు తవ్వినట్లు, ఈ ఆక్రమణపై ముదినేపల్లి తహసిల్దార్‌కు, ఎంపీడీవోకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. చెరువును, మందల బయలు భూమిని ఆక్రమించి చేపల చెరువు తవ్వడం వల్ల ఊర చెరువును పంచాయతీ తవ్వించే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు.







ఆగిరిపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు.. కైకలూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు.. కలిదిండిలో నివాళులు

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

ప్రభుత్వ, టీడీపీ కార్యాలయాల్లో ఘనంగా దివంగత ఎన్టీఆర్ జయంతి వేడుకలు

కేకులు కట్ చేసి మిఠాయిల పంపిణీ.. పేదలకు అన్నదానాలు..





మండవల్లిలో కేకు కట్ చేస్తున్న నాయకులు.. ముదినేపల్లిలో ఎన్టీఆర్‌కు నివాళులు

నూజివీడు టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, పట్టణ, గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిరస్మరణీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. నూజివీడు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పడాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు జగదీష్ కిషోర్, పాల్గొన్నారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నూజివీడు బ్రాంచ్‌లో ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి అక్కినేని ఆంజనేయ ప్రసాద్ ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎన్.ప్రభాకర్, బ్యాంక్ ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు. ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ కె.మస్తానయ్య ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముసునూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ఎంపీడీవో బి.ఏ సత్యనారాయణ, తహసీల్దార్ కె.వి రమణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా మండల కార్యాలయాల్లో ఎంపీడీవో బి.ఏ సత్యనారాయణ, తహసీల్దార్ కె.వి రమణ, ఎస్ఐ ఎం.చిరంజీవి, ఎంఈవో బి.వి. యస్ సుబ్బారావు తదితరులు ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముసునూరులో టీడీపీ నాయకులు గార్లపాటి నరసింహరావు, తుమ్మల లక్ష్మణరావు, అట్లూరి హరిబాబు తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ పటానికి నివాళులు అర్పించి, కేక్‌ను కట్ చేశారు. గోపవరంలో ఎస్సీకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ గ్రామ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్ పూలమాలలు వేశారు. రమణక్కపేట మెయిన్ సెంటర్‌లో పార్టీ దిమ్మవద్ద నాయకులు ఉప్పే సత్యనారాయణ, గోళ్ళ గురునాథం, కంటె సత్యనారయణ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చాట్రాయి: తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీడీవో విజయలక్ష్మి, ఏవో విష్ణు ఇతర అధికారులు సిబ్బంది నివాళులు అర్పించారు. చాట్రాయి, చనుబండ, సూరంపాలెం, కోటపాడు, నరశింహారావుపాలెం తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, బొంతు సత్యనారాయణ, మంచిన పూర్ణచంద్రరావు, గార్లపాటి మారేష్, నక్కా రాము, అంబటి సత్యనారాయణ, గడ్డం ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల కార్యాలయం వద్ద ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో అబ్దుల్ సలాం, వ్యవసాయశాఖ అధికారి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు పామర్తి నరసయ్య ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలోని కల్యాణ మండపం వద్ద ఎన్టీయార్ జయంతి నిర్వహించారు.

కలిదిండి: కలిదిండిలో దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, టీడీపీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సీతారామాంజనేయులు, నాయకులు పోసిన వీరేసు, భట్రాజు ఏసుబాబు, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. మూల్లంకలో పేదలకు అన్నదానం చేశారు.

ముదినేపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వై.రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్, కార్యాలయ ఏవో రమణారావు, ఇతర అధికారులు సిబ్బంది ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పవన్ కుమార్ కేక్ కట్ చేశారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ గ్రంథాలయ అధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ జీవిత విశేషాలను వివరించారు. చిగురుకోటలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి కందేపి పద్మ, అల్లూరులో పార్టీ నాయకులు దాసరి శ్రీను ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. గ్రామాల్లో పార్టీ నాయకులు బొప్పన సుందరరామయ్య, యర్రా రాంబాబు, అడుసుమిల్లి రామకృష్ణ, చల్లగుళ్ళ ఆదిత్య తదితరులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండవల్లి: మండవల్లి మండలం భైరవపట్నంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎన్డీయే నాయకులు చాపరాలు నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు బొల్లంపల్లి కృష్ణారావు, సజ్జా బాబిలు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

కైకలూరు: మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించిన మహోన్నతమైన నాయకుడు దివంగత ఎన్టీ రామారావు అని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. బుధవారం తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కైకలూరు తాలుకా సెంటర్, కోరుకొల్లురోడ్డు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, పట్టణపార్టీ అధ్యక్షుడు పడమటి వాసు, ప్రధాన కార్యదర్శి బాజానీ, నీటిసంఘం అధ్యక్షుడు గంగుల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్ ఫణీంద్ర ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాచకులకు భోజనం బాక్సుల పంపిణీ



చాట్రాయి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మండల తెలుగు యు వత కార్యదర్శి ఇజ్జిగాని మురళీ కృష్ణ, రా ఫౌండేషన్ ఇన్‌చార్జి మిద్దె అఖిల్, టీడీపీ నాయకు డు భరత్, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు బుధవారం చనుబండ నుంచి విస్సన్నపేట వరకు రోడ్లు వెంట ఉన్న 200 మంది యాచకులకు భోజనం బాక్సులను పంపిణీ చేశారు.

మహానాడులో నాయకుల సందడి





కడపలో మంత్రి పార్థసారథితో చాట్రాయి నాయకులు.. ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్నితో కలిదిండి నాయకులు..

చాట్రాయి, మే 28(ఆంధ్రజ్యోతి): కడప మహానాడులో చాట్రాయి మండల టీడీపీ శ్రేణులు సందడి చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సుమారు 150 మంది టీడీపీ నాయకులు కార్యకర్తలు కార్లలో కడప మహానాడుకు వెళ్ళి అక్కడ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. పనిలో పనిగా మంత్రులు రాష్ట్ర స్థాయి నేతలను కలిసి ఫొటోలు దిగుతున్నారు. కొంత మంది నాయకులు గురువారం సాయంత్రం జరిగే భారీ బహిరంగ సభకు బుధవారం రాత్రి బయలుదేరారు.

కలిదిండి: కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడులో కలిదిండి మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు బుధవారం పాల్గొన్నారు. అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు ఎం.రామకృష్ణ, పరశురాముడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కడపలో బుధవారం జరిగిన తెలుగు దేశంపార్టీ మహానాడు కార్యక్రమంలో ముదినేపల్లి మండల తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి, ఏపీ టూరిజయం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, పార్టీ జిల్లా కార్యదర్శి పోసినపాండురంగారావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావునాగరాజు ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలసి ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అందాల పోటీల్లో ఫస్ట్ రన్నరప్‌గా మౌనిక

మిసెస్ తెలుగు యూఎస్ఏ పోటీలు



నూజివీడు, మే 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడుకు చెందిన అట్లూరి మౌనిక మిసెస్ తెలుగు యూఎస్ఏ 2025 అందాల పోటీలలో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. ఈనెల 26వ తేదీన అమెరికాలోని డల్లాస్ నగరంలో ఈ అందాల పోటీలు జరిగాయి. ఐదు నెలల వ్యవధిలో వివిధ దశలలో ఈ పోటీలు జరిగాయి. 26వ తేదీన జరిగిన తుది పోటీలలో మౌనిక ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. బీఈ సివిల్ ఇంజనీరింగ్‌లో ఆమె గ్రాడ్యుయేషన్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇరిగేషన్‌శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. 2017లో ఆమె వివాహం చేసుకుని ఉద్యోగానికి రాజీనామా చేసి అమెరికా వెళ్ళిపోయారు. అక్కడే ఒక ప్రఖ్యాత కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమెకు ఇద్దరు పిల్లలు.

ప్రత్యేక కేటగిరీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీలలో ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు పొందే విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బుధవారం నూజివీడులో నిర్వహించారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరిల్లో ప్రవేశాలకు సంబంధించి మొత్తం 473 మందికి కాల్ లెటర్లు పరంగా 346 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటాలో 320 మందికి కాల్ లెటర్లు పంపగా 227 మంది, క్యాప్ కోటాలో 153 మందికి కాల్ లెటర్లు పంపగా 119 మంది అభ్యర్థులు హాజరైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జున్‌రావు, ప్రొఫెసర్ గోపాలరాజు, ఏవో బండి ప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

అధికారికంగా ఎన్టీఆర్ జయంతి పట్ల హర్షం

కైకలూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ పద్మశ్రీ ఎన్టీ రామారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల జూనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అధికారికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎన్టీఆర్ అభిమాన సంఘం ఎంతో రుణపడి ఉంటుందన్నారు. ఇప్పుడు అధికారికంగా చేపట్టడంతో నిజమైన గౌరవం దక్కిందని కొనియాడారు. అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు లక్కింశెట్టి మోహన్, అధ్యక్షుడు వేగిరెడ్డి సురేష్, అభిమాన సంఘం నాయకులు జక్కా సత్యనారాయణ, పెండెం బ్రదర్స్, బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పుస్తకాలు

సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

ఆగిరిపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి హిల్ స్కూల్లో నిర్వహిస్తున్న టీచింగ్ ఎట్ ద రైట్ లెవెల్ శిక్షణ కార్యక్రమం ముగింపుకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కొవిడ్ అనంతరం విద్యార్థుల్లో కనీస పఠన, గణిత సామర్థ్యాలు లేకపోవటాన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ్ ఫౌండేషన్ సహకారంతో టీచింగ్ ఎట్‌ది రైట్ లెవెల్ కార్యక్రమాన్ని అమలు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం స్పష్టమవుతోందని, పిల్లలకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు నేర్పించి వారిని హైస్కూల్‌కి ప్రమోట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష నోడల్ ఆఫీసర్ కల్పనా, ప్రథమ్ ఫౌండేషన్ ఏపీ-తెలంగాణ స్టేట్ ఇన్‌చార్జి పెండెం రాంబాబు, రాష్ట్ర ప్రోగ్రామ్ ఇన్‌చార్జి బి.వినోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.లక్ష్మమ్మ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు.. ప్రభుకిరణ్ (ఫైల్‌ఫొటో)

చాట్రాయి, మే 28 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలం పోలవరం కోనేరు రంగారావు కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఇంటర్ విద్యార్థి పరసా ప్రభుకిరణ్(17) మృతి చెందాడు. కాలనీ మీదుగా 11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. ఈ లైన్ కింద మృతుడి కుటుంబ ఇంటి సర్వీస్ వైరు వెళుతున్నది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గాలికి 11 కేవీ వైరు ఇంటి సర్వీస్ వైరుపై పడటంతో ఇంట్లో ఉన్న విద్యుత్ మీటరు, స్విచ్ బోర్డులు, బల్బులు, ఫ్యాను కాలిపోయాయి. మేల్కొన్న ప్రభు కిరణ్ ఏమి జరిగిందో తెలియక కంగారులో స్విచ్ ఆపటానికి బోర్డు ముట్టుకోవటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవల కూడా ఇంట్లో షార్టు సర్క్యూట్ అయ్యిందని, లైన్‌మెన్‌కి చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ఈ కాలనీ ఏర్పడక ముందు ఇది వ్యవసాయ భూమి కావటంతో 11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. ఈ లైన్‌తో అవసరం లేకపోయినా తొలగించ లేదు. ఈ లైన్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని లైన్‌మెన్‌కి అనేక సార్లు చెప్పినా లక్ష్యపెట్ట లేదని గ్రామస్థులు అంటున్నారు. కూలి పనులు చేసుకుని జీవిస్తున్న పరసా ఈశ్వరరావు, జ్యోతి దంపతుల రెండో కుమారుడు ప్రభుకిరణ్ ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో చేరటానికి సిద్ధమవుతుండగా మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యుత్ ఏఈ సంజయ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందించటానికి కృషి చేస్తానని అన్నారు. ఎస్ఐ డి.రామకృష్ణ కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఏ కారణమో తెలియదు కాని ఒక యువకుడు పంది కొక్కులను సంహరించే గ్యాస్ బిళ్లలను మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండవల్లి మండలం లోకుమూడికి చెందిన అంబటి తంబి(24) దెందులూరు మండలం కొవ్వలి గ్రామ పరిధిలోని ఒక చేపల చెరువుపై పనిచేస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. చేపల చెరువుల గట్లపై పందికొక్కులను సంహరించడానికి పెట్టే గ్యాస్ బిళ్లలు మూడింటిని 27వ తేదీ రాత్రి మింగేశాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దెందులూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నిమ్మ @ 10

» భారీగా పతనమైన నిమ్మ ధర
» పెట్టుబడులు రావంటూ రైతుల ఆవేదన

పెదవేగి, మే 28 (ఆంధ్రజ్యోతి): నిమ్మ ధర పతనమైంది. ఏడాదిన్నర కాలంగా రైతుల ఆశలకు అనుగుణంగా ఉన్న ధర పది రోజులుగా తగ్గుతూ ఇప్పుడు మరింత తగ్గింది. 2024 మార్చి నుంచి నిమ్మ ధర పెరుగుతూ అదే ఏడాది కిలో ధర సెంచరీ మార్క్‌ను దాటింది. అప్పటినుంచి కాస్త నిలకడగా కొనసాగుతూ ఈనెల వరకు కొంచెం అటూ ఇటుగా కిలో రూ.50 నుంచి రూ.70 పలికింది. అంతకుముందు ఏడాది వరకు గిట్టుబాటు ధరలేక అల్లాడిన రైతులు ఏడాదిన్నరగా కొంతమేర లాభపడ్డారు. ఈనెల ప్రారంభం నుంచి ధర పతనమవుతూ రావడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం నిమ్మలకాయల మార్కెట్‌లో సోమవారం కిలో నిమ్మ రూ.15 నుంచి రూ.25ల మధ్య పలుకగా మంగళవారం మరింత దిగజారి కిలో రూ.10 నుంచి రూ.15కు పడిపోయింది. సాధారణంగా ఈనెలాఖరు వరకు నిమ్మకు మెరుగైన ధర ఉంటుంది. కానీ ఈ ఏడాది మేనెల ప్రారంభం నుంచి తగ్గుతూ ఇప్పుడు రూ.15లకు పడిపోవడంతో రైతులు దిగాలు చెందు తున్నారు. ధర తగ్గుదల కు వర్షాలు కురవడమేనని వ్యాపారులు చెబుతున్నారు.

శ్రమ కూడా దక్కేలా లేదు

ఒక్కసారిగా తగ్గిన ధర మా ఆశలను అడియాసలు చేసింది. పెట్టుబడి పక్కన పెడితే కీసం శ్రమకు తగిన ఫలితం కూడా దక్కదు. ఎరువులు, పురుగుల మందులు, కూలీలు.. ఇలా పెట్టుబడి చూస్తే చాంతాడంత ఉండగా రాబడి లేదు. ఈ ఏడాది అప్పులే మిగులుతాయి.

– మాదు రాట్నాలరావు, నిమ్మరైతు, లక్ష్మీపురం